ఈనాడు
నాగర్‌కర్నూల్
ఆదివారం సెప్టెంబరు 29, 2024

కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : కుక్కల సంతానోత్పత్తి నియంత్రించేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుక్కల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నందున నియంత్రించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాటిని బంధించి సంతానోత్పత్తి జరగకుండా ఉండేందుకు ప్రత్యేక కేంద్రాన్ని నాగర్‌కర్నూల్‌లో ఏర్పాటు చేశామని కల్వకుర్తిలోనూ అదే తరహాలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కుక్కలను పెంచుకుంటున్న యజమానులు ఏటా రేబీస్ నిరోధక టీకాలను క్రమం తప్పకుండా ఇప్పించాలన్నారు. విద్యార్థులు వీధి కుక్కల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవానికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఇబ్బందులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, పుర అధ్యక్షుడు సత్యం, కమిషనర్ మహమూద్ షేక్, డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. జివి రమేష్, ఆర్డీవో శ్రీను, తహసీల్దారు ఇబ్రహీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యర్థానికి అర్థానిస్తున్న డీఆర్సీ కేంద్రం

ఉపాధి పొందుతున్న మహిళా సమాఖ్య సభ్యులు ● ఆదర్శంగా నిలుస్తున్న కల్వకుర్తి పురపాలక సంఘం


తూకం చేస్తున్న సమాఖ్య సభ్యురాలు


యంత్రంలో వ్యర్థాలను పోస్తున్న మహిళలు

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : నిత్యం ప్రతి ఇంటి నుంచి, వ్యాపార సముదాయాల నుంచి కిలోల కొద్దీ వ్యర్థాలు బయటకు వస్తుంటాయి. వాటిని అధిక మంది నిప్పటించడం, కాల్వలో పారబోయడం చేస్తుండేవారు. దీని ద్వారా పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు పొగతో పర్యావరణం దెబ్బతినేది. దీనిని దృష్టిలో ఉంచుకొని కొంత కాలంగా పురపాలికల్లో ఇంటింటికి తిరిగి సిబ్బంది చెత్త సేకరణ చేస్తున్నారు. డపింగ్‌యార్డు లేకపోవడంతో సేకరించిన చెత్తను పట్టణ శివారుల్లో పోసి నిప్పంటించడం, లేదంటే పాత వ్యవసాయ బావుల్లో పోసేవారు. దీని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండక పోవడంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. తడిచెత్త పొడి చెత్తను వేరుగా సేకరించి రెండింటిని తిరిగి వినియోగించుకునేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. దానిని కల్వకుర్తి పురపాలక సంఘం అందిపుచ్చుకుని నిత్యం సేకరిస్తున్న తడి, పొడిచెత్తకు ఒక అర్థాన్ని ఇచ్చేవిధంగా తయారు చేసి జిల్లాలోని అన్ని పురపాలికలకు ఆదర్శంగా నిలుస్తుంది.

5 క్వింటాళ్ల వ్యర్థాల సేకరణ..: పురపాలికలో నిత్యం ఇంటింటికి వెళ్లి సిబ్బంది చెత్తసేకరణ చేస్తున్నారు. అందులో తడిచెత్తను వర్మి కంపోస్టు చేస్తుండగా పొడిచెత్తలోని కాగితాలు(అట్టముక్కలు) ప్లాస్టిక్ వస్తువులు, గాజు సీసాలను డీఆర్సీ సెంటర్‌కు తరలిస్తున్నారు. డీఆర్సీ సెంటర్‌లో పుర అధికారులు అన్ని వసతులు కల్పించి స్వయం సహాయ సంఘాల సభ్యులకు అప్పగించారు. పుర సిబ్బంది సేకరించిన వ్యర్థాలను వారు కిలో లెక్కన కొనుగోళు చేస్తున్నారు. కాగితపు ముక్కలకు రూ.6, ప్లాస్టిక్‌కు రూ.12, గాజుసీసాలకు రూ.2 చొప్పున పుర కార్మికులకు సమాఖ్య సభ్యులు చెల్లిస్తున్నారు. కొనుగోలు చేసిన వాటిని యంత్రం ద్వారా బేళ్లుగా మార్చుతున్నారు. సుమారు ఆరు నెలలుగా 17.3 టన్నుల వ్యర్థాలను బేళ్లుగా మార్చారు. అందులో పేపర్‌లు 6 టన్నులు, ప్లాస్టిక్ 6.3 టన్నులు, గాజు 5టన్నులు సేకరించారు. బేళ్లుగా మార్చిన వ్యర్థాలను హైదరాబాద్‌కు చెందిన పరిశ్రమలతో ఒప్పందం చేసుకుని వారికి విక్రయించి ఆదాయాన్ని పొందుతున్నారు. డీఆర్సీ సెంటర్ ద్వారా తాము ఉపాధి పొందడంతో పాటు కార్మికుకు ఆర్థిక తోడ్పాటునందించడం జరుగుతుందని మహిళలు అంటున్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

కల్వకుర్తి పురపాలికను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తమ వంతుగా కృషి చేయడం జరుగుతుంది. పట్టణంలో పరిశుభ్రతకు, పచ్చదనానికి అధిక ప్రాధాన్యతనివ్వడం జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేని విధంగా రూ.1.18 కోట్లతో డీఆర్సీ సెంటర్‌ను (డీ కంపోజ్ సెంటర్) ఏర్పాటు చేయడం జరిగింది. దీని ద్వారా కొంతమందికి ఉపాధితో పాటు పట్టణం పరిశుభ్రంగా మారింది.
- ఎడ్మసత్యం, పుర అధ్యక్షుడు, కల్వకుర్తి

విద్యార్థులు, యువతే ప్రచార తారలు

యువ క్లబ్‌ల ద్వారా పాలమూరు పర్యాటకంపై దృష్టి ● ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 1,397 ఏర్పాటు

మహబూబ్‌నగర్ సమీపంలో పిల్లలమర్రికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. ఈ మహా వృక్షం ఊడలు ఎక్కడ మొదలయ్యాయో ఎవరూ కనుక్కోలేకపోయారు. దేశంలోనే ప్రసిద్ధి పొందిన పిల్లలమర్రి గురించి నేటి తరానికి తెలిసింది తక్కువే. ప్రధానంగా విద్యార్థులు, యువతకు పిల్లలమర్రి ప్రాముఖ్యత తెలియదు. మన ప్రాంతంలోనే ఉన్న దీని ప్రాముఖ్యతను తెలుసుకుని భవిష్యత్తు తరాలకు తీసుకెళ్లే బాధ్యతను జిల్లాలోని విద్యార్థులు, యువకులు తీసుకోనున్నారు.

నల్లమల అంటే అడవులే కాదు. కృష్ణా నది అందాలు.. అభయారణ్యం.. పులులు, ఇతర జంతువులు.. ఆధ్మాత్మిక కేంద్రాలు.. ప్రకృతి రమణీయత.. ఇలా సమ్మేళనంగా ఉన్న నల్లమల గురించి పూర్తి స్థాయి అవగాహన నేటి తరానికి అవసరం. ఇక్కడి పర్యాటక విశేషాలను ఇతరులకు అందించాలి. అలా జరగాలంటే ఆ బాధ్యత స్థానిక విద్యార్థులు, యువతపైనే ఉంది.





ఈనాడు, మహబూబ్‌నగర్: రాష్ట్ర పర్యాటకశాఖ సమన్వయంతో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న యువ టూరిజం క్లబ్‌లు(వైటీసీ) స్థానిక విద్యార్థులు, యువతను కొత్త ఆలోచనల వైపు నడిపించనున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,397 వైటీసీలను ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 34,925 మంది విద్యార్థులు, యువకులు భాగస్వామ్యం కానున్నారు. కేవలం మహబూబ్‌నగర్ జిల్లాలోనే 1,317 క్లబ్‌లు ఏర్పాటు చేశారు. మిగతా నాలుగు జిల్లాల్లో ప్రస్తుతం ఉన్న క్లబ్‌లను పెంచడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు.

బాధ్యత వీరిదే..: నంద వంశం నుంచి అసఫ్ జాహీ వంశం వరకు 22 ప్రముఖ రాజవంశాలు ఈ ప్రాంతాన్ని పాలించాయి. హరిహర, శక్తి కేంద్రాలకు పాలమూరు ఎంతో ప్రసిద్ధి. ముస్లింలు పవిత్రంగా భావించుకునే దర్గాలకు కొదవలేదు. కృష్ణా, తుంగభద్ర నదులు ఇక్కడి నుంచే ప్రవహిస్తాయి. నల్లమల ప్రకృతి సౌందర్యం ఇట్టే కట్టిపడేస్తాయి. వనపర్తి, గద్వాల, కొల్లాపూర్, ఆత్మకూరు, గోపాలపేట సంస్థానాలకు గుర్తింపు ఉంది. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 34 ప్రాంతాలను వారసత్వ, చారిత్రక, ఆధ్మాత్మిక కేంద్రాలను పర్యాటకశాఖ గుర్తించింది. ఈ సంపదను కాపాడటం, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ఈ యువ టూరిజం క్లబ్‌లు పని చేయనున్నాయి.

ఒక్కో క్లబ్‌లో 25 మంది..: ఈ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా స్థానిక విద్యార్థులు, యువతకు పర్యాటక ప్రాముఖ్యతపై పూర్తిస్థాయి అవగాహన కల్పించనున్నారు. మొదటి దశలో క్లబ్‌ల ఏర్పాటు, రెండో దశలో పర్యాటకంపై వివిధ దశల్లో పోటీలు నిర్వహించనున్నారు. మూడో దశలో ఈ క్లబ్‌లు క్షేత్రస్థాయికి వెళ్లి సంస్కృతి, సంప్రదాయాలకు పర్యాటక రంగాలు ఎలా ఉపయోగపడతాయి? వీటి పరిరక్షణ ఎలా చేయాలి? వంటి వాటిపై దృష్టి పెడతారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాయిలో ఒక్కో క్లబ్‌ను 25 మందితో ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి క్లబ్‌కు అందులోని విద్యార్థియే నాయకుడిగా, ఆ విద్యాలయంలో పని చేసే ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. దీనిపై మహబూబ్‌నగర్ పర్యాటకశాఖ అధికారి వెంకటేశ్వర్లు 'ఈనాడు'తో మాట్లాడుతూ ఈ క్లబ్‌ల ఏర్పాటుతో పాలమూరు పర్యాటకానికి మరింత గుర్తింపు రావడంతోపాటు విద్యార్థులు, యువతకు వారసత్వ సంపదపై అవగాహన కలుగుతుందన్నారు.

జిల్లా	టూరిజం క్లబ్‌లు	విద్యార్థులు, యువత
మహబూబ్‌నగర్	1,317	32,925
నాగర్‌కర్నూల్	37	925
జోగులాంబ గద్వాల	12	300
నారాయణపేట	19	475
వనపర్తి	12	300

అసాంఘీక కార్యకలాపాలపై ఉక్కుపాదం: ఐజీ సత్యనారాయణ


వెల్దండ ఠాణాలో దస్త్రాలను పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: అసాంఘీక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని మల్టీ జోన్ ఐజీ సత్యనారాయణ ఆదేశించారు. శనివారం వెల్దండ ఠాణాను ఆయన తనిఖీ చేసి పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు, కేసుల విచారణలో పురోగతి, పోలీసుల పనితీరు, స్టేషన్ పరిసరాలు, కేసుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణలపై ప్రత్యేక దృష్టి సారించి కట్టడి చేయాలన్నారు. నేరాల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. దొంగతనాలు జరగకుండా గ్రామాల్లో ముందుస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సైబర్‌క్రైమ్ బారిన పడకుండా ప్రజలను చైతన్య వంతులను చేయాలన్నారు. సామాజిక మధ్యమాల్లో అసత్యాలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్సై కురుమూర్తి పాల్గొన్నారు.

ఔషధాల కొరత.. రోగులకు వెత

ప్రభుత్వం నుంచి ఆసుపత్రులకు నిలిచిన సరఫరా




అత్యవసర విభాగంలో వైద్యసేవలు పొందుతున్న రోగులు

న్యూస్‌టుడే, పాలమూరు : మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఔషధాల కొరత తీవ్రమైంది. ప్రభుత్వం సకాలంలో సరఫరా చేయకపోవడంతో ఆసుపత్రి వర్గాలు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఓపీ సేవల కోసం నిత్యం ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 2వేలకు పైగా రోగులు వస్తున్నారు. 650 పడకలున్న ఈ ఆసుపత్రిలోని వార్డులన్నీ రోగులతో కిక్కిరిసిపోయాయి. అవసరం మేరకు ఔషధాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

మూడు రోజులకే మందులు.. : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు వైద్యులు పరీక్ష చేసిన తర్వాత ఐదు రోజులకు సరిపడా మందులు ఇచ్చేవారు. ఇప్పుడు మూడు రోజుల మందులతోనే సరిపెడుతున్నారు. జనరల్ ఆసుపత్రికి ప్రభుత్వం నుంచి ప్రధానమైన ఔషధాలు కూడా సరఫరా కావడం లేదు. మధుమేహం, వాంతులు, గ్యాస్, మూర్ఛ, మత్తుమందులు, పలు రకాల స్టెరాయిడ్స్, విషం విరుగుడు, నొప్పి నివారణ మందులు, కాల్షియం, మల్టీ విటమిన్ మాత్రలు, గర్భిణులకు అవసరమైన ఔషధాలు, డ్రెస్సింగ్ వాడాల్సిన వస్తువులు, యాంటిబయాటిక్స్, ప్రయోగశాలలో వాడే రసాయనాలు, రక్త పరీక్షల సొల్యూషన్స్, కిట్ల సరఫరా నిలిచిపోయింది. వాటిని ఆసుపత్రి వర్గాలు బయట కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

దూరం నుంచి వస్తే.. : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన పుష్పమ్మ తన తల్లి యాదమ్మకు జ్వరం వస్తే మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్ష చేశాక వైద్యులు మందులు రాశారు. మందుల కేంద్రం వద్దకు వెళ్తే రెండు రోజులకే జ్వరం మాత్రలు ఇచ్చారు. ఎంతో దూరం నుంచి వస్తే తగినన్ని మందులు కూడా ఇవ్వలేదని వారు తల్లీకూతుళ్లు ఆవేదన వ్యక్తంచేశారు.


తన తల్లికి కొన్నే మందులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్న పుష్పమ్మ

సిరంజీలూ కరవే

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని 30 విభాగాల్లో రోగులకు సిరంజీలతో వైద్యం చేస్తున్నారు. ఇంజక్షన్లు ఇవ్వడానికి, సెలైన్ ఎక్కించడానికి, రక్త పరీక్షలు చేయడానికి, రోగులకు మత్తు మందు ఇవ్వడానికి, రక్త నమునాలు తీసుకోవడానికి సిరంజీలు, సూదులు అవసరం. ప్రభుత్వం నుంచి మూడు నెలల నుంచి సరఫరా లేదు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిత్యం 2,500 సిరంజీలు అవసరం అవుతున్నాయి. రోజూ 25 సిరంజీ పెట్టెలు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కోదానిలో 100 సిరంజీలు ఉంటాయి. బాక్సు ఖరీదు రూ.240. ఇలా రోజు సిరంజీలను కొనుగోలుకే రూ.6వేలు ఖర్చు చేస్తున్నారు. మూడు నెలల నుంచి రూ.5.40లక్షలు సిరంజీలకు వెచ్చించారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు : ప్రభుత్వం నుంచి ఔషధాల సరఫరా నిలిచింది. తగిన స్థాయిలో ఔషధాలు నిల్వ లేకపోవడంతోనే మూడు రోజులకు సరిపోయేలా అందిస్తున్నాం. మా వద్ద లేని మందులు బయట కొనుగోలు చేసి రోగులకు వైద్య సేవలు చేస్తూ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే ఔషధాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.
- డా.సంపత్‌కుమార్ సింగ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మహబూబ్‌నగర్


లోక్‌అదాలత్‌లో 18,168 కేసులు పరిష్కారం

కందనూలు, న్యూస్‌టుడే : జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో 18,168 కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రాజేశ్‌బాబు తెలిపారు. పట్టణంలోని న్యాయస్థానంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో ప్రధాన న్యాయమూర్తి పాల్గొని మాట్లాడారు. ఎక్కువ కేసులు పరిష్కరించడానికి అన్ని న్యాయస్థానాల్లో కలిపి 10 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భూతగాదాలు, బ్యాంకు కేసులు, అబ్కారీశాఖ, క్రిమినల్ కేసులు రాజీకుదిర్చినట్లు వివరించారు. గ్రామాల్లో, పట్టణాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి లోక్‌అదాలత్ వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం తీసుకవచ్చినట్లు పేర్కొన్నారు. ఇరువర్గాల కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకొని సంతోషంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జి. సబితా, జూనియర్ సివిల్ న్యాయమూర్తి మౌనిక, ఒకటోవ అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి మమతారెడ్డి, రెండోవ అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.



1న డీఈఎల్ఈడీ, డీపీఎస్ఈ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: డిప్లొమా ఇన్ ఎలమెంట్రీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) 2024-26లో ప్రవేశం పొందిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని డైట్ కళాశాల ప్రిన్సిపల్ మేరాజుల్లా ఖాన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రవేశం పొందిన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను పరిశీలించుకోవాలని సూచించారు.



తుది ఓటరు జాబితా విడుదల


తెలకపల్లిలో జాబితా విడుదల చేస్తున్న అధికారులు

కందనూలు, న్యూస్‌టుడే : స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ కార్యాలయాల్లో తుది ఓటరు జాబితా విడుదల చేశారు. మొత్తం పురుషుల ఓటర్లు 3,23,705 ఉండగా మహిళల ఓటర్లు 3,22,689 మంది ఉన్నారు. ఇతరులు 13 మంది ఉండగా మొత్తం 6,46,407 మంది ఓటర్లున్నారు.

జిల్లాలోని 464 పంచాయతీల పరిధిలో ఓటర్ల వివరాలు ఇలా..

మండలం	వార్డుల సంఖ్య	పురుషుల ఓటర్ల సంఖ్య	మహిళల ఓటర్ల సంఖ్య	ఇతరులు	మొత్తం ఓటర్ల సంఖ్య
అచ్చంపేట	312	18,169	18,190	01	36,360
అమ్రాబాద్	182	13,973	14,459	0	28,432
బల్మూరు	208	17,688	17,263	0	34,951
బిజినేపల్లి	324	30,866	30,752	0	61,618
చారకొండ	142	10,439	10,180	2	20,621
కల్వకుర్తి	214	15,591	15,371	0	30,962
కోడేర్	210	18,262	17,638	0	35,900
కొల్లాపూర్	152	13,886	13,271	0	27,157
లింగాల	206	15,306	15,600	1	30,907
నాగర్‌కర్నూల్	178	17,000	17,114	0	34,114
పదర	92	8,649	8,395	0	17,044
పెద్దకొత్తపల్లి	258	24,216	23,845	3	48,064
పెంట్లవెల్లి	92	8,868	8,706	0	17,574
తాడూరు	216	15,047	15,126	0	30,173
తెల్కపల్లి	260	22,561	22,469	1	45,031
తిమ్మాజిపేట	236	16,113	16,416	1	32,530
ఉప్పునుంతల	222	15,078	15,525	0	30,603
ఊర్కొండ	138	8,797	8,922	0	17,719
వంగూరు	228	16,352	16,768	0	33,120
వెల్దండ	270	16,844	16,679	4	33,527


సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లేకుండా పాలకవర్గ సమావేశం

కందనూలు, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లేకుండా ఒక రోజు సమావేశానికి తాత్కాలిక అధ్యక్షుని నియమించుకొని సాధారణ సమావేశం నిర్వహించడం రాజకీయ విమర్శలకు తావిచ్చింది. శనివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు కౌన్సిలర్లకు ఈనెల 25న సమాచారం ఇచ్చారు. మొత్తం 24 మంది కౌన్సిలర్లుకు గాను 8వ వార్డు సభ్యురాలికి ఒప్పంద ఉద్యోగం రావడంతో పదవికి రాజీనామా చేశారు. 23 మందికి గాను పాలకవర్గ సమావేశానికి 13 మంది కౌన్సిలర్లు, ఇద్దరు కో- ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేదు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశాన్ని మధ్యాహ్నం 2.00 గంటలకు ప్రారంభించారు. ఒక రోజు సమావేశానికి 13 వార్డు కౌన్సిలర్ శ్రీనువాసులును తాత్కాలిక అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. సమావేశంలో వివిధ అంశాలను చర్చించి నిధుల కేటాయింపులపై తీర్మానాలు చేశారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లేకుండా సమావేశం ఎట్లా నిర్వహిస్తారని భారాస కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. కోరమ్ లేక పోవడంతో సమావేశం వాయిదా వేసి తిరిగి సోమవారం సమావేశం నిర్వహించాలని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. అధికార పార్టీ కౌన్సిలర్లు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొని తీర్మానాలు చేసుకున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పురపాలక సంఘం కమిషనర్ నరేశ్‌బాబును వివరణ కోరగా సమావేశం నిర్వహించడానికి కోరమ్ ఉండటం వలన పురపాలక సంఘం చట్టం ప్రకారం ఒక రోజు సమావేశానికి హాజరైన సభ్యుల ఆమోదంతో తాత్కాలిక అధ్యక్షుని ఎన్నుకొని సాధారణ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం అంశాలు చర్చించినట్లు పేర్కొన్నారు.



విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు క్రికెటర్లతో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్

పాలమూరు క్రికెట్ జట్టు శుభారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 వన్డే రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు శుభారంభం చేసింది. శనివారం హన్మకొండ మైదానంలో వరంగల్ జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో 34 పరుగుల తేడాతో జిల్లా జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 34.5 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయింది. షాదాబ్ అహ్మద్ 38, కనిష్క్ 13, రాంచరణ్ 13, ముఖీత్ 10 పరుగులు చేశారు. అనంతరం వరంగల్ జట్టు లక్ష్య ఛేదనలో చతికిల పడి 29.4 ఓవర్లలో 87 పరుగులకు ఆలౌట్ అయింది. పాలమూరు జట్టు నుంచి ముఖీత్ 3, షాదాబ్ 2, శశాంక్, అంకిత్, కనిష్క్ చెరో వికెట్ తీశారు. విజయం సాధించిన జిల్లా జట్టు క్రికెటర్లను ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా అభినందించారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి



మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.



ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న యువతులు, మహిళలు

ఒక్కేసి పువ్వేసి సందమామ!

ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మతో నారాయణపేట ఎమ్మెల్యే డా.పర్ణికరెడ్డి, విద్యార్థినులు





బతుకమ్మలతో యువతులు


మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు.. సంప్రదాయ దుస్తులతో ముస్తాబై వచ్చిన విద్యార్థినులు, అధ్యాపకులతో శనివారం మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సందడిగా మారింది. చప్పట్లు కొడుతూ వందలాది గొంతుకలు ఒక్కటై ఆలపించిన బతుకమ్మ పాటలు అందరినీ తన్మయత్వానికి లోనుచేశాయి. కళాశాలలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా సాయి. ముఖ్యఅతిథులుగా మహబూబ్‌నగర్, నారాయణపేట ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డా.పర్ణికరెడ్డి, రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, పుర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండగ గొప్పతనాన్ని వివరించారు. ఆధ్యాత్మికత, ప్రకృతి పరిరక్షణే ఈ వేడుక పరమార్థమని అభిప్రాయపడ్డారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కొద్దిసేపు సరదాగా బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మార్కెట్ ఉపాధ్యక్షుడు పెద్ద విజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేశ్, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సిరాజ్ ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, శివ, నవీన్, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో యోగా బోధకుల భర్తీకి మౌఖిక పరీక్ష

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆస్పత్రుల్లో యోగా బోధకుల పోస్టుల భర్తీకి ఈ నెల 30న మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలోని ఆయుష్ ఆయుర్వేద ఆస్పత్రిలో ఉదయం 10.30 గంటలకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయుష్ ఉమ్మడి జిల్లాధికారి డా.ఆదిశేషయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌లో 15 మంది పురుషులు, 15 మంది మహిళలు, నాగర్‌కర్నూల్‌లో 19 - పు॥, 19 - మ॥, వనపర్తిలో 9 - పు॥, 9 - మ॥, జోగులాంబ గద్వాలలో 9 - పు॥, 9 - మ॥, నారాయణపేట జిల్లాలో 8 మంది పురుషులు, 8 మంది మహిళలు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి లేదా ఇంటర్ విద్యార్హతలు, ఆరు నెలల యోగా శిక్షణ పొందిన ధ్రువపత్రం కలిగి ఉన్న 45 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఆధార్, విద్యార్హత, యోగా ధ్రువపత్రాలతో ఆసుపత్రిలో నివేదించాలని సూచించారు.

కంచే చేను మేస్తే..!

- అక్రమ వసూళ్లతో గాడి తప్పుతున్న పోలీసులు
- ఎవరికి చెప్పుకోలేక బాధితుల అవస్థలు




కందనూలు, న్యూస్‌టుడే : ప్రజలకు రక్షణగా నిలిచి ధన, మాన, ప్రాణ, ఆస్తులను కాపాడాల్సిన రక్షక భటులు కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అవినీతికి పాల్పడుతూ వ్యక్తిగత విషయాల్లోనూ తలదూరుస్తూ వివాదాస్పదమవుతున్నారు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠ దిగజార్చుతున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించాలంటేనే జంకే పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవలి కొన్ని ఘటనలు ఆ శాఖకు తలవంపులు తెచ్చేలా ఉన్నాయి. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి చర్యలు చేపట్టడమే కాకుండా కేసుల నమోదుకు వెనుకాడటం లేదు.



నాగర్‌కర్నూల్ : బిజినేపల్లి ఠాణాలో వివరాలు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ (పాత చిత్రం)

బెదిరింపులకు పాల్పడి..: మే 15న నాగర్‌కర్నూల్ పట్టణంలోని నల్లవెల్లి రోడ్డు పక్కన బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కారులో తన స్నేహితురాలితో కలిసి భోజనం చేస్తుండగా బ్లూకోర్ట్స్ కానిస్టేబుల్ ట్యాబ్‌తో ఫొటో తీశాడు. రూ. 10 వేలు ఇవ్వకపోతే కొత్త చట్టాల ప్రకారం కేసు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేశాడు. గత్యంతరం లేక బాధితుడు రూ. 2 వేలను కానిస్టేబుల్ స్నేహితుని ఖాతాకు అంతర్జాలం ద్వారా చెల్లించాడు. బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహించే మరో కానిస్టేబుల్ ఇదే తరహా బెదిరింపులకు పాల్పడటమే కాక ఫొటోను కుటుంబ సభ్యులకు చూపడంతో కుటుంబ కలహాలు నెలకొన్నాయి. విషయం వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు విచారించి ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు.



బిజినేపల్లి ఠాణాలోని ఓ కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేసిన బాధితుడు

తాత ఫిర్యాదుతో..: బిజినేపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన యువకుడు సురేశ్ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈనెల 26న గురువారం గ్రామానికి రాగా యువతి తల్లిదండ్రులు యువకుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సురేశ్ డయల్ 100కి సమాచారం ఇచ్చారు. బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ వచ్చి మీకు సహాయం చేస్తానని సురేశ్ నుంచి రూ. 2 వేలు వసూలు చేశాడు. విషయం తెలుసుకున్న సురేశ్ తాత వెంకటయ్య శుక్రవారం ఠాణాలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహిస్తున్నారు.

నేరుగా రంగంలోకి ఉన్నతాధికారులు..

బిజినేపల్లి మండల పరిధిలో జూదం జోరుగా కొనసాగుతోంది. వారంలో రెండు సార్లు జూదం కేసులు నమోదవుతున్నాయి. పోలీసు సిబ్బంది అక్రమ వసూళ్లకు అలవాటు పడి దాడులు చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలోని డీఎస్పీ, సీఐ రహస్య సమాచారం మేరకు నేరుగా రంగంలోకి దిగి దాడులు చేస్తూ జూదరులను అరెస్టు చేస్తుండటం గమనార్హం.

డయల్ 100ను ఆసరాగా అక్రమ వసూళ్లు

రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా సత్వర న్యాయం కోసం డయల్ 100కు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించడానికి బ్లూకోర్ట్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్తున్నారు. ఇరువర్గాల మధ్య చిన్న ఘర్షణ జరిగినా ఓ వర్గానికి చెందిన వారిని బెదిరించి అక్రమ వసూళ్లు చేస్తున్నారు. అలాగే రాత్రి సమయంలో ఒంటరిగా ఉండే జంటల చిత్రాలను తీసి బెదిరింపులకు పాల్పడి వారి వద్ద అందిన కాడికి దండుకుంటున్నారు. గ్రామ, పట్టణ శివారు ప్రాంతాల్లో మద్యం తాగుతున్నట్లు సమాచారం వచ్చినా డబ్బులు వసూలు చేసి వారిని అక్కడి నుంచి తప్పిస్తున్నారు. ఇదే తరహాలో అక్రమ వసూళ్లకు పాల్పడి నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ అయ్యారు.

సమాచారం ఇచ్చిన వారే లక్ష్యం


కల్వకుర్తి డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రాత్రి వేళ గుట్టుగా సాగుతుండటంతో గ్రామస్థులు డయల్ 100 ద్వారా సమాచారం ఇస్తున్నారు. సిబ్బంది అక్రమార్కుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తూ ట్రాక్టర్లను విడిచిపెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బందిని ప్రశ్నిస్తే గ్రామస్థులపైనే కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

సిబ్బంది క్రమశిక్షణారాహిత్యాన్ని ఉపేక్షించబోం. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆరోపణలు వచ్చిన వెంటనే సిబ్బందిపై విచారణ నిర్వహిస్తున్నాం.

- గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ నాగర్‌కర్నూల్

అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ: మంత్రి జూపల్లి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, పక్కన డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, న్యూస్‌టుడే : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పథకాలు అమలుచేస్తున్నారని, అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ తప్పక చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం పాన్‌గల్ రైతు వేదికలో విండో మహాజనసభ డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని గుర్తుచేశారు. రుణమాఫీకి అర్హులై ఉండి చిన్న చిన్న పొరపాట్లతో కానీ వారికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పర్యాటక, చారిత్రక ప్రాంతాలను ఉచితంగా సందర్శించి జ్ఞానాన్ని పొందాలని మంత్రి సూచించారు. పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం 'తెలంగాణ దర్శిని' కార్యక్రమం అమలుపై విద్యార్థులకు వివరించారు. డీసీసీబీ ఛైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సింగిల్ విండోల ద్వారా రైతులకు ఇంకా మెరుగైన సేవలు అందించడానికి కృషిచేస్తామన్నారు. అనంతరం రెడ్డిసేవాసమితి ఆధ్వర్యంలో ఛైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, డీపీవో సురేష్, ఎంఈవో శ్రీనివాసులు, విండో వైస్ ఛైర్మన్ బాలయ్య, సీఈవో భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తిమ్మాజిపేటలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శేఖర్ (45) శనివారం ఉదయం చేపలు తీసుకొస్తానంటూ గ్రామ సమీపంలోని రాళ్ల చెరువుకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో కాలుజారి చెరువులో పడిపోయారు. పక్కనే పొలంలో పనులు చేసుకుంటున్న కొందరు గుర్తించి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారమిచ్చారు. అందరూ వెళ్లి చెరువులో శేఖర్‌ను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



శేఖర్

'ప్రభుత్వంపై బీసీల్లో అపనమ్మకం'



ధర్నాలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు కావొస్తున్నా బీసీ గణనపై ఊసేలేదని ప్రభుత్వ వైఖరితో బీసీ వర్గాల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయని భారాస నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో బీసీ మహాసభ ధర్నాకు హాజరైన ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు కావొస్తున్న బీసీ వర్గాలు బడుగులుగానే ఉండటానికి కారకులెవరో చెప్పాలన్నారు. 50 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ఉద్యమానికి కల్వకుర్తి నుంచే శ్రీకారం చుట్టామన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతు రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత తనదేనని భరోసా కల్పించారు. బీసీలు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

రాజీమార్గంతో కేసులు పరిష్కారించుకుంటే మేలు

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే: రాజీమార్గంతో కేసులు పరిష్కరించుకుంటే మేలని జడ్జి అరవింద్‌సింగ్ మిదున్‌తేజ అన్నారు. శనివారం లోక్ అదాలత్‌లో 1,128 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వ మార్గంలో కేసులు పరిష్కరించుకుంటే కక్షిదారులు ఇద్దరూ విజయం సాధించినవారవుతారన్నారు. కొల్లాపూర్ కోర్టులో రెండు బెంచీలు ఏర్పాటు చేశారు. మొదటి బెంచికి చైర్మన్, జడ్జి మిదున్‌తేజ, రెండో బెంచికి చైర్మన్, జడ్జితో జ్యోత్స్న వ్యవహరించారు. రాజీ మార్గంతో 34 కేసులు, ఎక్సైజ్ కేసుల్లో అపరాధ రుసుంతో 3, చలానా కేసులు 1,087 కేసులు పరిష్కరించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీహరి, ఏపీపీ శిరీష, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



కొల్లాపూర్ కోర్టులో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి అరవింద్‌సింగ్ మిదున్‌తేజ

అమ్రాబాద్, న్యూస్‌టుడే: అచ్చంపేట కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో అమ్రాబాద్ సర్కిల్‌కు చెందిన 36 కేసులను కక్షిదారులు పరిష్కరించుకున్నట్లు అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్ తెలిపారు. అమ్రాబాద్ ఠాణాకు చెందిన 18, ఈగలపెంట ఠాణాకు చెందిన 8, పదర ఠాణాకు చెందిన 10 కేసులను కక్షిదారులు రాజీ కుదుర్చుకుని పరిష్కరించుకున్నట్లు సీఐ వివరించారు.

వెలగని ఆకాశ దీపాలు

అచ్చంపేట పట్టణంలో ప్రధాన రహదారి గుండా ఏర్పాటు చేసిన హైమాస్ట్ దీపాలు వెలగడంలేదు. ప్రధాన కూడళ్లలో సైతం ఇదే పరిస్థితి ఉంది. సాయిరాం థియేటర్ నుంచి అటవీ కార్యాలయం వరకు, ఎస్బీఐ బ్యాంకు నుంచి పట్టణ శివారు వరకు చీకటిమయంగా ఉంటోంది. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు వాపోతున్నారు. టెండర్లు పిలిచామని, త్వరలో పనులు పూర్తి చేస్తామని సంబంధిత ఏఈ రాజేందర్ తెలిపారు.

- న్యూస్‌టుడే, అచ్చంపేట టౌన్


దీపాలు అలంకారం.. దారంతా అంధకారం

వీడని నిర్లక్ష్యం.. పగలే దేదీప్యం

వట్టెం గ్రామంలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో విలువైన విద్యుత్తు వృథా అవుతోందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి మల్లేశ్‌ను వివరణ కోరగా, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికి జరిగిందని, తక్షణమే వృథాను నిలువరిస్తామన్నారు.



- న్యూస్‌టుడే, బిజినేపల్లి

తెలంగాణలో బహుజన రాజ్యం రావాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల రాజ్యం రావాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శనివారం కల్వకుర్తి పట్టణంలో బీసీ మహాధర్నాకు విచ్చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రెండో భద్రాద్రి చారకొండ మండలం శిర్సనగండ్ల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని ముందుగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ అర్చకులు, బీసీ, కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆయన శ్రీసీతారామ చంద్రస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఎప్పుడూ సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం దక్కాలని స్వామిని మొక్కుకున్నామన్నారు. సింగిల్‌విండో చైర్మన్ గురువయ్యగౌడ్, బీసీల ఉపాధ్యక్షుడు వెంకటయ్యయాదవ్, మాజీ జడ్పీటీసీ రవీతేజ, మాజీ సింగిల్‌విండో చైర్మన్ యాదయ్యగౌడ్, నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, రమేశ్, సలీమ్, కొండల్, సత్యం, అశోక్, మల్లికార్జున్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయాలతో తప్పని ఇబ్బందులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : పాఠశాల విద్యా శాఖ అనాలోచిత నిర్ణయాలతో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు అన్నారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు ఉత్తర్వుల్లో సవరణలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) ఆధ్వర్యంలో అచ్చంపేటలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కాకుండా ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఇన్‌చార్జి ఎంఈవో నియామకంలో లోపాలను సవరించాలని డిమాండ్ చేశారు. జాక్టో నాయకులు నరేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, సతీశ్, కృష్ణయ్య, రజాక్, సృజన, శంకర్, ప్రవీణ్‌కుమార్, ధనలక్ష్మి పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల పని సర్దుబాటు ఉత్తర్వుల్లో లోపాలు సవరించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి జూపల్లి

కోడేరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన బావాయిపల్లి సందర్శించారు. కొందరు గ్రామస్థులు ప్రభుత్వ పథకాలు అమలు కావడంలేదని వాటిని అమలు చేసేలా చూడాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నాయకులు మహేశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, నాగేంద్రం పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : పదిరోజులక్రితం అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ సోదరుడు సూర్యబాలగౌడ్ దశదినకర్మ శనివారం వెన్నచర్లలో నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు సుధాకర్‌రావు, నేత జగదీశ్వర్‌రావు, ఎన్జీ మైనార్టీఫోరం జాతీయ అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు తదితరులు హాజరై నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌ను ఓదార్చారు.


బావాయిపల్లిలో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు

నాగర్‌కర్నూల్: 7993300530 | కల్వకుర్తి: 9908803650
అచ్చంపేట: 8008573927 | కొల్లాపూర్: 8008573869


ఎంపీడీవో కార్యాలయం గేటు వద్ద గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

సమస్య : అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయం గేటు వద్ద గుంతలుగా ఏర్పడి నీళ్లు నిలిచాయి. అధికారులను కలిసేందుకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- శంకర్‌నాయక్

సమాధానం : వెంటనే పరిశీలించి చదును చేయిస్తాం.

- మధుసూదన్‌గౌడ్, ఎంపీడీవో

సమస్య : నార్లాపూర్ జలాశయం నిర్మాణంతో ముంపునకు గురైన సాగునీటి కాల్వను సున్నపుతండా, బోడబండతండా దగ్గర రహదారి పక్క నుంచి ప్రత్యామ్నాయంగా నిర్మాణం చేశారు. కురుస్తున్న వర్షాలకు ఈ కాల్వ కోతకు గురైంది. చివరి ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి. కాల్వ ద్వారా లక్ష్యంమేర పొలాలకు సాగునీరందించాలి.


- వెంకటయ్య, రైతు

సమాధానం : కాల్వ ద్వారా చివరి పంట పొలాలకు సాగునీరు అందించడానికి చర్యలు చేపట్టాం. దెబ్బతిన్న ప్రాంతంలో మరమ్మతులు చేయిస్తాం.

- శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటి పారుదలశాఖ

- న్యూస్‌టుడే, అచ్చంపేట, కొల్లాపూర్

పైపులైన్ల నిర్మాణంలో ఇబ్బందులు


నీళ్లు చేరడంతో పైపులైన్లలో వేరుగా అయిన పైపులు

కొల్లాపూర్, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ పథకానికి ఏడాదిపాటు నీటి సమస్య లేకుండా ప్రత్యామ్నాయంగా నార్లాపూర్ జలాశయం నుంచి భగీరథ ఇన్‌టెక్‌వెల్‌కి రూ.140 కోట్లతో చేపట్టిన పైపులైన్ల నిర్మాణంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వర్షాలు కురుస్తుండటం, కాల్వల ద్వారా సాగునీటి విడుదలతో మండలంలోని సున్నపుతండా, బోడబండతండా మధ్యలో పైపులైన్ నిర్మాణానికి సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. ఇప్పటికే జలాశయం ప్రాంతంలో హెడ్ రెగ్యులేటరీ దగ్గర పంపుహౌస్, సర్జిపూల్ తదితర నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి భగీరథ ఇన్‌టెక్‌వెల్‌లోకి చేపట్టిన పైపులైన్ నిర్మాణంలో నీళ్లు చేరడంతో సాంకేతిక సమస్యలు నెలకొన్నాయి. విరిగిన పైపులు ఊడి వేర్వేరుగా ఉన్నాయి. నీళ్లలో పైపులు ఉండటం వల్ల పనుల్లో జాప్యం నెలకొంటోంది. ప్రస్తుతం ఎంజీకేఎల్ఐలోని ఎల్లూరు జలాశయం ఆధారంగా భగీరథకు నీటి సరఫరా జరుగుతోంది. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా పైపులైన్ల నిర్మాణం చేపట్టినట్లు డీఈ సుధాకర్‌సింగ్ చెప్పారు. డిసెంబరులోగా పనులు పూర్తి చేసి వచ్చే వేసవిలో ఎల్లూరు, నార్లాపూర్ జలాశయాల నుంచి నీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామన్నారు. పైపులైన్లలో చేరిన నీటిని తోడేసి నిర్మాణ పనులు చేపడతామన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

అచ్చంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని స్వేరోస్ ఇంటర్నేషనల్ ప్రతినిధి మల్లయ్య అన్నారు. మన్ననూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రూ.30 వేల విలువైన బెడ్లు శనివారం అందజేశారు. పాఠశాలలో గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం సిద్దార్థ మహదేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలను కొల్లాపూర్‌లోనే ఏర్పాటు చేయాలని విద్యా వికాస చైర్మన్ బత్తిని రాము అన్నారు. కొల్లాపూర్ పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొల్లాపూర్ విద్యాపరంగా వెనకబాటుకు గురవుతుందన్నారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టాలని పోరాటం చేశామన్నారు. ఫలితంగా కొల్లాపూర్‌కు వచ్చిన ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలను వేరే ప్రాంతానికి తీసుకెళ్లారన్నారు. వెంటనే ఇక్కడ కళాశాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

ఎస్జీఎఫ్ విజేతలకు బహుమతులు ప్రదానం

అచ్చంపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ఎదగాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ అండర్-14, 17 విభాగంలో బాల బాలికలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు శనివారం డీఈవో గోవిందరాజులుతో కలిసి ఆయన బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంఈవోలు జీవన్ కుమార్, బషీర్, పాండు, స్వరూపా, నాగేశ్వర్‌రావు, మల్లయ్య, చంద్రకళ, వినోద్, రమేష్, రాజేందర్ పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థులు

పాఠశాల అభివృద్ధికి కృషి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే: కొల్లాపూర్‌లో గాంధీ స్మారకోన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించనున్నారు. 1986-87 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు శనివారం ఇక్కడ సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా ఊరేగించారు. అనంతరం గురువులను సన్మానించి పాదాభివందనం చేశారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న గదుల నిర్మాణానికి సహకరిస్తామని తెలిపారు.


పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

కుక్కకాటుపై నిర్లక్ష్యం వద్దు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : కుక్కకాటుపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. వెంకటదాసు అన్నారు. శనివారం పాలెం జూనియర్ కళాశాలలో రేబిస్ దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. కుక్క,పిల్లి, కోతి, గబ్బిలం గాటు ద్వారా మనుషులకు రేబిస్ సోకుతుందన్నారు. ప్రధానంగా పెంపుడు కుక్కలకు రేబిస్ విధిగా అందించాలని సూచించారు. వీధికుక్కలు, కోతుల కాటుకు గురైతే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకోవాలన్నారు. చికిత్స తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రాణహాని సంబవించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మాధవరెడ్డి, ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది రమేశ్ కుమార్, రాజేశ్వర్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. వెంకటదాసు

గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా రాజేందర్

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా గంగాపురం రాజేందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అచ్చంపేటకి చెందిన సీనియర్ న్యాయవాది, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు ఛైర్మన్‌గా నియామకం కావడంతో ప్రజలు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ విజయం కోసం, కాంగ్రెస్ బలోపేతానికి ఆయన కృషి చేశారు.

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : దేవర
కల్వకుర్తిలో.. పార్థసారథి : దేవర
నేషనల్ : దేవర

కూరగాయల ధరలు కిలో... రూ.లలో



టమాటా 28, వంకాయ 45, బెండ 40, మిరప 40, కాకర 65, బీర 60, క్యాలిఫ్లవర్ 65, క్యాబేజీ 45, క్యారెట్ 60, దొండ 48, ఆలుగడ్డ 40, ఉల్లిగడ్డ 55, గోకర 65, దోస 40, ఆనంకాయ 18, చిక్కుడు 65, మునగకాయ 60, బీట్‌రూట్ 50, ఖీర, 40, బీన్స్ 90.

- న్యూస్‌టుడే, కందనూలు

● శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


శనీశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని నందివడ్డెమాన్‌లో గల జేష్టాదేవి సమేత శనీశ్వరాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో శనీశ్వరునికి తిల, తైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పరమశివునికి రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు శాంతికుమార్, గోపాలరావు, ప్రభాకరాచారి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక వ్రతాలు


పాలెంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని పాలెం వెంకన్న ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. అర్చకులు జయంత్, చక్రపాణి, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా గుర్రం జాషువా జయంతి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే: కవి గుర్రం జాషువా జయంతిని శనివారం పీజీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రధానాచార్యులు మార్క్‌పోలోనియస్ మాట్లాడుతూ జాషువా ప్రత్యేక నైపుణ్యత, సాహిత్య అంశాలను వివరించారు.

నేడు కల్వకుర్తి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక

కల్వకుర్తి, న్యూస్‌టుడే : పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర క్రీడా ప్రాంగణంలో ఆదివారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక ఉంటుందని అధ్యక్ష, కార్యదర్శులు విజేందర్‌యాదవ్, స్వాములు తెలిపారు. అండర్ -14 బాలబాలికలు, 16, 18, 20లోపు బాలబాలికలకు అథ్లెటిక్స్, అండర్ -14, 16, 18, 20లోపు బాలబాలికలకు పోటీలుంటాయని తెలిపారు. క్రీడాకారులు హాజరుకావాలని వారు కోరారు.

100 రోజులపాటు 'సత్యశోధన' పాదయాత్ర

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే : గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ ఆధ్వర్యంలో 'బాపూ బాటలో.. సత్య శోధన' పాదయాత్ర గోడపత్రికను శనివారం గద్వాలలో జిల్లా కలెక్టర్ సంతోష్ ఆవిష్కరించారు. విశ్రాంత జిల్లా విద్యాధికారి విజయ్‌కుమార్, పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎన్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర అక్టోబరు 2న అలంపూర్‌లోని జోగులాంబ దేవాలయం నుంచి ప్రారంభమై వచ్చే ఏడాది జనవరి 12న అచ్చంపేటలోని ఉమామహేశ్వర దేవాలయం వద్ద ముగించనున్నారు. 100 రోజుల్లో 1000 కిలోమీటర్లు కొనసాగే ఈ యాత్రలో చేనేత వస్త్రాల ప్రోత్సహించాలని, సంపూర్ణ ఆరోగ్యం లాంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

క్రీడలు సాంస్కృతిక కళల్లో నైపుణ్యం సాధించాలి

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : విద్యార్థులు, యువత విద్యలోనే కాకుండా క్రీడలు సాంస్కృతిక కళల్లో నైపుణ్యం సాధించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం పట్టణంలో యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లా యువజన ఉత్సవాలను నిర్వహించారు. స్వామి వివేకానందుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని, దానిని బయటికి తీసేందుకు యువజన ఉత్సవాలు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థుల జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం నాయక్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, డీఎస్‌వో రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.


యువజన ఉత్సవాల్లో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

వారం రోజుల్లో పనులన్నీ పూర్తవ్వాలి : కలెక్టర్: వంగూరు, న్యూస్‌టుడే : కొండారెడ్డిపల్లి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ వారం రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. శనివారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాలశీతలీకరణ కేంద్రం, గ్రామ పంచాయతీ, బీసీ కమ్యూనిటీ హాల్, పశువైద్య కేంద్రం, రైతువేదిక, హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించి ఆరా తీశారు. అధికారులతో సమావేశమై రోడ్ల విస్తరణ, లైటింగ్, సౌర విద్యుత్తు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి పనులన్నింటినీ దసరా పండుగ రోజు ప్రారంభిస్తారని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ దేవసహాయం, ఆర్డీవో శ్రీను, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి జీవి రమేశ్ పాల్గొన్నారు.

కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు చర్యలు: కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : కుక్కల సంతానోత్పత్తి నియంత్రించేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుక్కల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నందున నియంత్రించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


శ్రావణి

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని సీఎన్ఆర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి. శ్రావణి ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యవస్థాపకుడు భాస్కర్‌రావు శనివారం తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

అడవిలోకి గొర్రెలను అనుమతించాలని వినతి

మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : మేత కోసం నల్లమలకు వచ్చే ఇతర ప్రాంత గొర్రెలను అడవిలోకి అనుమతించాలని యాదవ సంఘం నేతలు డీఎఫ్ఓ రోహిత్ గోపిడిని కోరారు. శనివారం మన్ననూరులో అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాశన్నయాదవ్ సంఘం నేతలతో కలిసి డీఎఫ్ఓను కలిసి మాట్లాడారు. గొర్రెల కాపరుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే గొర్రెల కాపరులపై అటవీ సిబ్బంది దాడులను, అడవి నుంచి బయటకు పంపించడం తదితర విషయాలపై మాట్లాడారు. గొర్రెలను అడవిలోకి అనుమతించక పోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన యాదవులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గొర్రెల పెంపకం దారులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. యాదవ సంఘం నేతలు రామలింగయ్య యాదవ్, జబ్బు వెంకటేశ్ యాదవ్, జాల మల్లయ్య, దొడ్ల మహేశ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలి


దస్త్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ వైభవ్ గైక్వాడ్

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని ఎస్పీ వైభవ్ గైక్వాడ్ అన్నారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన సందర్శించి దస్త్రాలను పరిశీలించారు. విధి నిర్వహణలో పోలీసులు, సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఠాణాలకొచ్చే బాధితులకు పోలీసు సేవలపై నమ్మకం కలిగించాలన్నారు. గ్రామాల్లో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్సైలు పాల్గొన్నారు.

సమస్యలుంటే నేరుగా ఫిర్యాదు చేయాలి : కందనూలు, న్యూస్‌టుడే : ఆర్మ్డ్ రిజర్వు పోలీసు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా ఫిర్యాదు చేయాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. పట్టణంలోని పరేడ్ మైదానంలో శనివారం పోలీసు దర్బార్ నిర్వహించగా ఎస్పీ పాల్గొని మాట్లాడారు. జిల్లా పోలీసు శాఖ నుంచి సిబ్బందికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్, ఏఆర్ అదనపు ఎస్పీ భరత్‌చంద్ర, నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, డీపీవో గణాంక అధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.

యువత ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సైదులుయాదవ్ కోరారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ రవికుమార్, నాయకులు హరి, మహేశ్, రామ్‌కోటి విద్యార్థులు పాల్గొన్నారు.

పెనిమిళ్లలో భగత్‌సింగ్ జయంతి: ఉప్పునుంతల, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ జయంతిని శనివారం మండలంలోని పెనిమిళ్లలో నిర్వహించారు. యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ యువజన సంఘం ప్రతినిధులు కొత్త విజయ్, ఎం.అశోక్‌గౌడ్, బి.ఆంజనేయులు, ఎస్.కిరణ్ పాల్గొన్నారు.


తెలకపల్లిలో సర్దార్ భగత్‌సింగ్ జయంతిలో పాల్గొన్న సీపీఐ నాయకులు

తెలకపల్లి, న్యూస్‌టుడే : స్వాతంత్ర్య సమరయోధుడు, యువ కిశోరం, సర్దార్ భగత్‌సింగ్ యువతకు ఆదర్శమని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శంకర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రం, గౌరెడ్డిపల్లి ప్రధాన కూడళ్ల దగ్గర శనివారం యువకిశోరం జయంతిని సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్ సభ్యుడు మాట్లాడారు. మండల కార్యదర్శి రవిందర్, నాయకులు ఆంజనేయులు, దస్తగిరి, వెంకటస్వామి, బాలపీరు, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బీమయ్య, శంకర్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

కందనూలు, న్యూస్‌టుడే : తిరుమల, తిరుపతి లడ్డును కల్తీకి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు సుధాకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్యాంసుందర్, శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్ : ర్యాలీ నిర్వహిస్తున్న పరిరక్షణ సమితి సభ్యులు

ఉపాధి హామీలో రూ.14 లక్షల అక్రమాలు అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో రూ.14 లక్షల అవినీతి అక్రమాలు జరిగినట్లు జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రాజేశ్వరి తెలిపారు. మండలంలోని 10 పంచాయతీలకు ఇటీవల ప్రజావేదిక నిర్వహించారు. మరో 28 పంచాయతీలకు శనివారం ప్రజావేదిక నిర్వహించి చేసిన పనులు, చెల్లించిన కూలీ చెల్లింపులపై బహిరంగ విచారణ చేపట్టారు. 35 పంచాయతీల్లో పూర్తి స్థాయిలో దస్త్రాలను పరిశీలించి రూ.14 లక్షల అక్రమాలు జరిగినట్లు గుర్తించి రికవరీ చేయాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి రూ.42 వేలు జరిమానా వేసినట్లు తెలిపారు. ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్, ఏపీవో పర్వతాలు పాల్గొన్నారు.

ప్లాట్‌ను చదును చేసిన వ్యక్తులపై కేసు నమోదు: వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ప్లాటును ఆక్రమించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జలంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం కొండూరు గ్రామానికి చెందిన మాధవి వనపర్తి పట్టణం నాగవరం గ్రామంలో 20 ఏళ్ల క్రితం ప్లాట్ కొనుగోలు చేశారు. ఆ ప్లాట్‌ను నాగవరం గ్రామానికి చెందిన దేవరాజు, నాగమ్మ, శేఖర్‌లు చదును చేశారని బాధితురాలు ఆరోపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి పాల్పడుతుండగా ఇద్దరు పట్టివేత: కందనూలు, న్యూస్‌టుడే : మండలంలోని కుమ్మెర వద్ద కొనసాగుతున్న వట్టెం పంప్ హౌజ్ వద్ద శనివారం తెల్లవారుజామున అదే గ్రామానికి చెందిన ఆరుగురు పాత ఇనుప సామాను, ప్లాస్టిక్ పైపులు చోరీకి పాల్పడుతున్నారు. భద్రత సిబ్బంది గమనించి మల్లేష్, భాస్కర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కంపెనీ సిబ్బంది శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : చిన్నారిపై లైంగికదాడికి ప్రయత్నించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక ఓ ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ చదువుతోంది. ఇటీవల వినాయకుడి ఉత్సవాల్లో మాయమాటలతో చిన్నారిని ఆకట్టుకున్న యువకుడు ఈ నెల 25న ద్విచక్ర వాహనంపై సమీపంలోని ఓ గ్రామానికి తీసుకెళ్లి చిన్నారితో అసభ్యంగా ప్రవర్తిస్తుండగా భయభ్రాంతులకు గురైన చిన్నారి ఏడ్చింది. వెంటనే చిన్నారిని తీసుకొచ్చి వసతి గృహానికి సమీపంలో వదిలేశాడు. మూడు రోజుల నుంచి బాధిత చిన్నారి నీరసంగా ఉండటాన్ని గమనించిన తోటి విద్యార్థినులు విషయాన్ని సంక్షేమాధికారి దృష్టికి తీసుకెళ్లగా ఆయన తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు శనివారం ఠాణాలో ఫిర్యాదు చేయడంతో యువకుడి పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కల్వకుర్తిలో 753 కేసులు పరిష్కారం

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : ఉచితం న్యాయం పొందేందుకు నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని కల్వకుర్తి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జి కావ్య అన్నారు. శనివారం కోర్టులో నిర్వహించిన మెగాలోక్‌అదాలత్‌ను న్యాయమూర్తులు ప్రారంభించి మాట్లాడారు. క్షణికావేశంలోనే అనేక మంది కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇరువురు కక్షిదారులు రాజీ కుదిరితే ఉచిత న్యాయం లభిస్తుందన్నారు. క్రిమినల్, సివిల్, బ్యాంకు లావాదేవీలకు సంబంధించి మొత్తం 753కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులు అధికారులు పాల్గొన్నారు.